క్లుప్తంగా

పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ అండ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి: పేదల వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన సీఎమ్మార్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఎంతో మందికి సీఎమ్మార్ఎఫ్ నిధులు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో తడగొండ సర్పంచు చిందం రమేశ్ పాల్గొన్నారు.

గోశాలలకు రాజన్న కోడెలు



కోడెలను అందజేస్తున్న ఆలయ అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న తిప్పాపూర్ గోశాలలోని కోడెలను జనగామ జిల్లా, మహబూబాబాద్ జిల్లాలోని గోశాలలకు కోడెలను మంగళవారం అందజేశారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన శివలింగం గోశాలకు 20 కోడెలు, మహబూబాబాద్ జిల్లా దంతులపల్లె గ్రామానికి చెందిన శ్రీమతి గోశాలకు 20 కోడెలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యామ్, శంకర్ పాల్గొన్నారు.

'మోగి పురుగు నివారణ చర్యలు చేపట్టాలి'



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త

బోయినపల్లి: రైతులు వరి నారు మడుల్లో మోగి పురుగు ఆశించకుండా తగు జాగ్రత్తలు, నివారణ చర్యలు తీసుకోవాలని కరీంనగర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని తడగొండ గ్రామంలో మోగి పురుగు ఆశించిన రైతుల వరి చేలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి నారు మడుల్లో కాండం తొలిచే పురుగు (మోగి పురుగు)ఆశించే అవకాశం ఉందన్నారు. నారు మడిలో ఈ పురుగు ఆశిస్తే పిలక దశలోనే మొక్కలు ఎండిపోతాయని తెలిపారు. రైతులు ఈ లక్షణాలు ఉన్న నారు మడులను గుర్తించి సంబంధిత ఏఈవోలకు చెబితే నివారణ మందులు సూచిస్తారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిందం రమేశ్, ఎంఏవో ప్రణీత, ఏఎంసీ డైరెక్టర్ గుడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మలిసంధ్యలో సం'రక్షణ'

- ఎల్లారెడ్డిపేటలో వృద్ధుల సంరక్షణ కేంద్రం
- రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక
- మంత్రి కేటీఆర్ ఆదేశాలతో ఏర్పాట్లు
- రూ.40 లక్షలతో పనులు పూర్తి
- తొలి దశలో 20 పడకలు



ప్రారంభానికి సిద్ధంగా డేకేర్ సెంటర్



కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: ఈ కంప్యూటర్ యుగంలో ప్రపంచ వ్యాప్తంగా అనేక మార్పులు చోటు చేసుకుంటుండగా మనుషుల మధ్య మాత్రం అంతరాలు పెరుగుతున్నాయి. ఈ తరం వృద్ధులు నిర్లక్ష్యానికి గురవుతున్నారు. కనిపెంచిన వారే కాదు పొమ్మంటున్నారు. వృద్ధాప్యంలో వివిధ వ్యాధులతో బాధపడుతుంటే వారి బాగోగులను చూసుకునేవారు కరువై వారు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. మలిసంధ్యలో శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే అనేక మంది వృద్ధులు నిర్లక్ష్యానికి గురవుతూ మనోవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కళ్ల ముందే తల్లిదండ్రులు చనిపోతుంటే కడుపున పుట్టినవారు పట్టించుకోవడం లేదు. ఇలాంటి వివక్షతకు గురవుతున్న వారినందరినీ ఒకేచోట చేర్చి వారి బాగోగులను చూసుకునే బాధ్యతను ప్రభుత్వం తన భుజస్కంధాలపై వేసుకుంది. అందుకు ప్రత్యేక ప్రభుత్వం ఒక పైలట్ ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది.

వృద్ధాప్యంలో నా అనేవారు లేకపోవడం, ఉన్నా పట్టించుకోకపోవడం, భారమని తలచి వృద్ధాశ్రమాల్లో చేర్పించడంతో మనోవేదనతో తల్లడిల్లితున్న వృద్ధులకు ప్రభుత్వం నిలువ నీడనిచ్చి సంరక్షిస్తుంది. వారికి మనోధైర్యం కల్పించేందుకు మంత్రి కేటీఆర్ సహకారంతో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఎల్లారెడ్డిపేటలో ఒక సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలానికి ఒక వృద్ధుల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు పోతోంది. ఎల్లారెడ్డిపేటలోని ఎస్టీ వసతి గృహంలో రూ.40 లక్షల వ్యయంతో ఈ సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అందుకు అవసరమైన వసతులపై కలెక్టర్ అనురాగ్ జయంతి ఇప్పటికే నాలుగుసార్లు తనిఖీ చేశారు. జనవరి 26 వరకు పూర్తి సౌకర్యాలతో అందుబాటులోకి తేచ్చేందుకు అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ కేంద్రంలో రెండు విధాలుగా వసతి కల్పనకు ఏర్పాట్లు చేస్తున్నారు. డేకేర్‌లో ఉదయం ఇంటి నుంచి వచ్చే వృద్ధులు సాయంత్రం వరకు అంతా సమూహంగా ఒక చోట ఉల్లాసంగా గడపడానికి, సుమారు 50 నుంచి 60 మంది వరకు ఉండేందుకు వీలుగా వసతులు కల్పిస్తుండగా, శాశ్వతంగా కేంద్రంలోనే ఉండిపోయే వృద్ధుల కోసం 20 మందికి సరిపడే బెడ్లను ప్రాథమికంగా సిద్ధం చేశారు. అలాగే అన్నపూర్ణ క్యాంటిన్ నుంచి భోజన వసతి, ఒక కేర్ టేకర్, వంట మనిషిని సమకూరుస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

వృద్ధులు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆట వస్తువులు (క్యారం, చెస్)తో పాటు పుస్తకాలను అందుబాటులో ఉంచుతారు. అనారోగ్యంతో ఉన్న వారికి చిన్నచిన్న వ్యాయామాలు చేయించేందుకు ఫిజియోథెరపిస్టులను నియమిస్తారు. మండల స్థాయి అధికారులు ప్రతిరోజూ ఈ కేంద్రాన్ని పరిశీలించి వీరికి అవసరమైన వసతులను సమకూర్చే విధంగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 26 వరకు ఈ కేంద్రం అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కన్నవారి వివక్షతకు గురవుతున్న వారంతా ఒక చోట చేరి జీవిత చరమాంకంలో సంతోషంగా గడిపేందుకు వీలుగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వృద్ధుల ఆయుష్షు పెరుగుతుంది



కన్నవారి నిరాధరణకు గురవుతున్న వృద్ధులకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సంరక్షణ కేంద్రంతో వారంతా ఒక చోట చేరి ఉల్లాసంగా గడపడం వల్ల వారి ఆయుష్షు పెరుగుతుంది. ఇప్పటికే గ్రామాల్లో కన్న బిడ్డలు పట్టించుకోకపోవడంతో అనేక మంది పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల నుంచి వారికి మనో ధైర్యం కల్పించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుంది.

– నిమ్మ నారాయణరెడ్డి, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్, నారాయణపూర్

జనవరి 26లోగా అందుబాటులోకి..



మంత్రి కేటీఆర్ ఆదేశాలతో సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. స్థానికంగా ఉన్న ఎస్టీ హాస్టల్‌ను భవనాన్ని పరిశీలించి అక్కడే ఏర్పాట్లు చేశాం. జనవరి 26 లోగా కేంద్రం అందుబాటులోకి వస్తుంది. వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు వారు కాలక్షేపానికి అవసరమైన సామాగ్రిని అందుబాటులో ఉంచుతాం. వృద్ధుల ఉల్లాసం కోసమే ప్రభుత్వం రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా ఎల్లారెడ్డిపేటను ఎంపిక చేసింది.

– జయంత్‌కుమార్, తహసీల్దార్, ఎల్లారెడ్డిపేట

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ: వేములవాడ పట్టణంలోని లక్ష్మీపూర్, బాలానగర్, లాలపల్లి, జగిత్యాల బస్టాండ్, గోశాలఏరియా, అంబేడ్కర్‌చౌక్, జాత్రాగ్రౌండ్, వాసవీనగర్, రాంమందిరంవీధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు సెస్ ఏఈ సుష్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరా నిమిత్తం లైన్లు సరిచేస్తున్నట్లు ఆమె తెలిపారు. సెస్ వినియోగదారులు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సమాచారం

గ్రూప్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), జిల్లా గ్రంథాలయ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గ్రూప్ 3, 4 ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 21లోపు గ్రంథాలయ భవనం మొదటి అంతస్తులో ఉన్న టాస్క్ ప్రాంతీయ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 70755 22671 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇల్లంతకుంట: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

నియామకం

కాంగ్రెస్ గ్రామ శాఖ కమిటీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆధ్వర్యంలో పార్టీ గ్రామశాఖను మంగళవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రమేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శిగా బాలచందర్‌తో పాటు శాఖ సభ్యులను నియమించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు పాల్గొన్నారు.

నామాపూర్‌లో..

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు మండల శాఖ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా గన్నె భాను, ఉపాధ్యక్షుడిగా బండిపెల్లి నవీన్, ప్రధాన కార్యదర్శిగా మేరుగు శ్రీరాంగౌడ్, కార్యదర్శులుగా కె.నవీన్, వాతపు బాలయ్య, కోశాధికారిగా మాదాసు నరేశ్, మహ్మద్ షబిల్, కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

సమాచార హక్కు కార్యకర్తల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ప్రవీణ్

గంభీరావుపేట: సమాచార హక్కు కార్యకర్తల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామానికి చెందిన కూడెల్లి ప్రవీణ్ నియమించినట్లు తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు ముత్తు ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారికి ప్రవీణ్ కృతజ్ఞతలు తెలిపారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- అన్ని కేంద్రాల్లో ట్రయల్ రన్ పూర్తి



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. కంటి వెలుగు కేంద్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆమె సందర్శించి మాట్లాడారు. 18 ఏళ్ల పైబడిన వారందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, మందులు, కళ్ల అద్దాలు అందజేస్తారని, ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వెలుగు కేంద్రాలకు వచ్చే ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్ సభ్యులు, ఆకునూరి విజయనిర్మల, ఆడెపు సౌజన్య, దూస విన్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ మంగళవారం సమీక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, ఎంపీవో గంగాతిలక్, పీహెచ్ వైద్యాధికారులు రేణుక, అనిత, రేణుశ్రీ, సూపర్‌వైజర్ శశికుమార్, పంచాయతీ కార్యదర్శి రాజసులోచన పాల్గొన్నారు.

కార్డులు ఆవిష్కరణ

అలాగే మండలంలోని కొదురుపాక రైతువేదిక భవనంలో కంటివెలుగు పరీక్షలకు సంబంధించిన కార్డులను జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, ఎంపీవో ఏ.గంగాతిలక్, వైద్యాధికారి రేణుశ్రీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య పాల్గొన్నారు.

ట్రయల్ రన్

వీర్నపల్లి: మండల కేంద్రంలో కంటి వెలుగు ట్రయల్ రన్ మంగళవారం రైతు వేదికలో నిర్వహించారు. ఏర్పాట్లను తహసీల్దార్ తాఫజుల్ హుస్సేన్ పరిశీలించారు. ఎంపీడీవో నరేశ్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్, గూడెంలలో కంటి వెలుగు శిబిరాల ఏర్పాట్లను మండల ప్రత్యేకాధికారి స్వప్న పరిశీలించారు. ఎంపీడీవో రమాదేవి, సర్పంచ్ సరిత, ఎంపీటీసీ శ్రీధర్, కార్యదర్శి రాజు, వైద్య సిబ్బంది ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్



అల్లుకున్న నిర్లక్ష్యం.!

చందుర్తి: మండలంలోని లింగంపేట గ్రామ చావడిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగ జాతి మొక్కలు అల్లుకుని తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు. ఏదైన సమస్య వచ్చినప్పుడు మరమ్మతులు చేయడానికి సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. సెస్ అధికారులు దృష్టి సారించి పెరిగిన తీగ జాతి మొక్కలు తొలగించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : స్రవంతి, సెస్, ఏఈ, చందుర్తి

ఫోన్ నెం: 94408 14077

రెండో ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

సిరిసిల్లటౌన్: వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను జీవో 16లో చేర్చి రెగ్యులర్ చేయాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ ప్రజలకు సేవలు చేస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా విధుల నిర్వహించామని, కానీ తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పనిలో భాగంగా ట్యాబ్‌లలో డాటా ఎంట్రీ వలన అర్ధరాత్రి వరకు పనిచేయాల్సి వస్తోందని, ప్రతి ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో పలు మండలాల్లోని పీఎచ్‌సీలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు, నాయకులు అజ్జవేణు, కదారి రాములు పాల్గొన్నారు.



బోనమో పోచమ్మ

కోనరావుపేట: మండలం కొలనూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు తిరుపతిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలు మారిన వారికి బదిలీల్లో అవకాశం ఇవ్వాలి

- తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్

వీర్నపల్లి: ప్రభుత్వం ప్రకటించిన టీచర్ల బదిలీలు, ప్రమోషన్లలో భాగంగా జీవో 317 ప్రకారం జిల్లాలు మారిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు వారి పాత స్టేషన్ పాయింట్లను పరిగణించి బదిలీ అవకాశం కల్పించాలి అని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ జీవో 317 అమలులో భాగంగా అనేక మంది ఉపాధ్యాయులు నూతన జిల్లాలకు కేటాయించబడ్డారని, వారికి కొత్త జిల్లాలో పాఠశాలలను కేటాయించే సమయంలో ఆయా జిల్లాల్లో ఉన్న మొత్తం ఖాళీలను చూపించకుండా కేవలం జిల్లాలోని మారుమూల స్థానాలను మాత్రమే చూపించారని విమర్శించారు. పాఠశాల కేటాయింపు సమయంలో వారి పాత స్టేషన్ పాయింట్లను పరిగణించకుండా కేవలం సర్వీస్ సీనియారిటీ ప్రకారం కౌన్సెలింగ్ చేశారన్నారు. దీంతో ఉన్న ఖాళీల్లో కొన్ని పట్టణ ప్రాంతాల పాఠశాలలను స్పౌజ్, ఇతర ప్రిఫరెన్సియల్ అభ్యర్థులు, సీనియర్లు దక్కించుకున్నారని తెలిపారు. దీంతో పాత జిల్లాల్లో ఒకే పాఠశాలలో పదేళ్లు పని చేసిన వారు సైతం సుదూర నూతన జిల్లాలో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత బదిలీల్లో 317 ద్వారా కొత్త జిల్లాలకు వచ్చిన వారికి పాత స్కూల్ స్టేషన్ పాయింట్లను ఇస్తూ బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. జిల్లా కార్యదర్శులు ఓ.ప్రవీణ్, తిరుపతి జాదవ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



సక్కునాయక్‌ను పరామర్శిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కిష్టునాయక్ తండాలో సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో సర్వం కోల్పోయిన భూక్య సక్కు నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మాట్లాడుతూ మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి ఆర్థికసాయం అందేలా చూస్తామన్నారు. సర్పంచులు ఉన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

భూక్య సక్కునాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి కోరారు. ఆయన కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.ఎంపీ బండి సంజయ్‌కుమార్‌తో మాట్లాడి ఆర్థికంగా ఆదుకుని అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్యతో పాటు నాయకులు తిరుపతిరెడ్డి, రవి, కృష్ణహరి, రవీందర్, యాదగిరి, లక్ష్మణ్, బాబు, గౌస్, రాజునాయక్ పరామర్శించారు.

అవకతవకలపై విచారణ జరిపించాలి

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఎస్ఐ, కానిస్టేబుల్ పోలీసు ఉద్యోగాల నియామకాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి అభ్యర్థులకు న్యాయం చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీద్ ఖాన్ డిమాండ్ చేశారు. పోలీస్ నియమకాల్లో హైకోర్టు తీర్పును అనుమతించాలని, రన్నింగ్‌లో అర్హత పొంది, లాంగ్ జంప్‌లో అనర్హులైన అభ్యర్థులను మెయిన్స్‌కి అనుమతించాలన్నారు. ప్రభుత్వం తీరుతో చాలా మంది అభ్యరులు నష్టపోయే ప్రమాదముందన్నారు. పోలీస్ నియమాకాల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా ఈనెల 19న కలెక్టరేట్ ముట్టడికి అభ్యర్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

వీర్నపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మాలోత్ బూల చేతుల మీదుగా 13 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తఫాలుల్ హుసేన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

చందుర్తి: మండలంలోని ఆశిరెడ్డిపల్లె, మూడపల్లి, నర్సింగపూర్, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.3.25 లక్షల చెక్కులను టీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రుద్రంగి ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, చందుర్తి సింగిల్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు దప్పుల అశోక్, సర్పంచ్ చిలుక అంజిబాబు పాల్గొన్నారు.

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలో 17వ వార్డులో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజ అందజేశారు. వార్డుకు చెందిన పంతం రేవతి రూ.19వేలు, కూస లక్ష్మి రూ.25 వేలు చెక్కులను పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ పూర్ణచందర్,పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గ్రామ శాఖ అధ్యక్షుడు బట్టు రాజు మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచ్ కదిరె రజిత పాల్గొన్నారు.

నిధులు మంజూరుపై హర్షం

రుద్రంగి: కోనరావుపేట మండలం మరిమడ్ల ఏకలవ్య పాఠశాల నుంచి రుద్రంగి మండలం మానాల వరకు రోడ్డు నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు చేసిన మంత్రులు సత్యవతి రాథోడ్, వేముల ప్రశాంత్‌రెడ్డికి వైస్ ఎంపీపీ చిన్న భూమయ్య, మండల ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కనకట్ల బాలయ్య సోమవారం అనారోగ్యంతో మరణించగా మంగళవారం ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు పరామర్శించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ముస్తాబాద్: మండలంలోని తుర్కపల్లి, ఆవునూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి మంగళవారం తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. అలాగే గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే గుడ్లు, పాలు, భోజనాన్ని క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. చిన్నారులు గైర్హాజరు కాకుండా చూసుకోవాలన్నారు. పిల్లలలో ఎదుగుదల, బరువు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. రికార్డులను సరిగా నిర్వహించాలన్నారు.